క్లుప్తంగా

విశాఖ-చెన్నై కారిడార్‌కు భూములు గుర్తించాలి


అధికారులతో సమావేశమైన ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించాలని ఆర్డీవో హెచ్‌వి జయరాం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివా రం రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఏపీఐఐసీ నక్కపల్లి మండలం రాజయ్యపేట, టి.ఎల్.పురం, అమలాపురం, బుచ్చియ్యపేట, కందనాడ, వేంపాడ పరిధిలో భూసేకరణ చేపడుతుందన్నారు. డి-పట్టా భూములు, అక్రమణ భూములను గుర్తించా లని ఆర్డీవో రెవెన్యూ అధికారులకు సూచించారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ రేవతమ్మ



నర్సీపట్నం : నర్సీపట్నం రూరల్ సీఐగా ఎల్.రేవతమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రేవతమ్మ ఇదే సర్కిల్‌లో సీఐగా బాధ్యతలు నిర్వహించారు. బదిలీపై రెండవసారి సీఐగా బాధ్యతలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని మాకవరపాలెం, కేడీ పేట, గొలుగొండ, నాతవరం ఎస్‌ఐలు దామోదర్, దివ్య, రామారావు, ఉమామహేశ్వరరావు సీఐ రేవతమ్మకు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

గణపతి మాలధారుల పూజలు

రోలుగుంట: ఆది దేవుడైన గణపతి నవరాత్రోత్సవాలు నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. రోలుగుంటలో ప్రతి ఏటా వలే సుమారు 40 మంది సిద్ధి వినాయక సంఘం వారి కుటుంబాలు గణపతి మాల ధరించారు. వీరు ఇక్కడ ఏర్పాటు చేసిన సిద్ధి వినాయకుడిని ప్రతిరోజు శుద్ధి చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల వద్ద మాలధారులు భక్తి గీతాలు ఆలపిస్తూ భక్తులను మైమరపిస్తున్నారు. ఆలయం వద్దే ప్రతి రోజు రాత్రిళ్ల పూజా కార్యక్రమాలు తరువాత భిక్ష ఏర్పాటు చేసుకుంటున్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన


మూడురోడ్ల కూడలిలో లక్ష బిల్వార్చన కార్యక్రమం

మాడుగుల: స్థానిక మూడురోడ్ల కూడలిలో శనివారం లక్ష బిల్వార్చన కార్యక్రమం బాలవినాయక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సుమారు 68 ఏళ్లుగా ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లక్ష బిల్వార్చన చేపడుతున్నట్టు అని భక్తులు తెలిపారు.

మోదమాంబ కాలనీలో తాగునీటి బోరు

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీలో 4 వ వార్డు ఎంపీటీసీ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు నిర్మాణం పూర్తి చేశారు. శనివారం ఈ బోరు ప్రారంభించడంతో తమకు తాగునీటి సమస్య తీరిందని కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో కోతుల పట్టివేత

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాదిలో ప్రజలపై దాడి చేస్తున్న కోతులను పంచాయతీ సిబ్బంది పట్టిస్తున్నారు. ఇటీవల కోతులు పది మందిపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో పంచాయతీ సిబ్బంది వానరాల సమస్యల నుంచి గట్టెక్కించడానికి కోతులను పట్టే వారిని తీసుకొచ్చారు. శనివారం మనుషులపై దాడి చేస్తున్న కోతులను పట్టుకుని ఏజెన్సీ ప్రాంతానికి తరలించారు.

తూతూ మంత్రంగా మదుముల ఏర్పాటు


కొట్టుకు పోయిన కల్వర్టు స్థానంలో ఏర్పాటు చేస్తున్న మదుములు

చీడికాడ : తుపానుకు ఖండవరం, మాడుగుల రోడ్డులో గెంజివారి కల్లాలు వద్ద గల కల్వర్టు కూలిపోయి కొట్టుకుపోవడంతో అధికారులు అక్కడ తిరిగి యుద్ధప్రాతిపదికన మదుములు ఏర్పాటు చేశారు. అయితే మదుముల కింద ఎటువంటి కాంక్రీట్ లేకుండా గొట్టాలు ఏర్పాటు చేశారని, చిన్న పాటి వర్షం కురిసినా మళ్లీ మదుములు కొట్టుకుపోతాయని చీడికాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సన్నిబాబు తెలిపారు.

సుద్ద ముక్క కొనడానికీ డబ్బుల్లేవు!

- ప్రభుత్వ పాఠశాలల్లో మంజూరు కాని అభివృద్ధి నిధులు
- అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు
- ఆరు నెలలుగా మంజూరు కాని శానిటేషన్ సిబ్బంది జీతాలు
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వం శీతకన్ను

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నల్ల బోర్డుపై రాసి పాఠాలు బోధించడానికి సుద్ద ముక్కలు కొనడానికీ నిధుల్లేక పాఠశాలల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలైనా ప్రభుత్వం నేటికీ పాఠశాల అభివృద్ధి నిధులు మంజూరు చేయలేదు.


బుచ్చెయ్యపేటలో పాఠాలు బోధిస్తున్న టీచర్

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలంలో 48 ప్రాథమిక పాఠశాలలు, 9 జిల్లా పరిషత్ హై స్కూళ్లు, 5 ప్రాథమికోన్నత పాఠశాలల్లో సుమారు 4,500 మంది విద్యార్థులు విద్యా బోధనలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. పాఠశాలలో విద్యుత్ బిల్లులు చెల్లింపునకు, బోధన జరపడానికి అవసరమైన చాక్‌పీస్‌ల కొనుగోలు, స్టేషనరీతో పాటు పాఠశాలల్లో వివిధ మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలి. ఏడాదికి విద్యార్థుల సంఖ్యను బట్టి హైస్కూల్‌కు రూ.75 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.25 వేలు, ప్రాథమిక పాఠశాలకు రూ.15 వేలు నగదును విడుదల చేయాలి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత పాఠశాల అభివృద్ధి నిధుల విడుదలపై ధ్యాసే లేదు. దీంతో పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు కట్టడానికి, సుద్ద ముక్కలు కొనుగోలుకి, ఇతర స్టేషనరీ ఖర్చులకు ఆయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు. పలువురు తమ జేబుల్లో డబ్బులు తీసి పాఠశాలల్లో మౌలిక వసతులకు ఖర్చు చేస్తున్నారు.

శానిటేషన్ సిబ్బందికి అందని జీతాలు

మండలంలో ఉన్న 62 పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బందికి 6 నెలలుగా జీతాలు లేవు. మండలంలో 68 మంది శానిటేషన్ సిబ్బంది పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లును శుభ్రం చేస్తున్నారు. వీరికి నెలకి టాయిలెట్ మెయింటెనెన్స్‌కు నెలకు రూ.6 వేలు అందించాలి. ఒక్కొక్కరికి రూ. 36 వేలు చొప్పున బకాయిలు ఉన్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని శానిటేషన్ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. తక్షణం ప్రభుత్వం పాఠశాలల్లో స్కూల్ గ్రాంటుతో పాటు శానిటేషన్ సిబ్బంది జీతాలు విడుదల చేయాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



పాఠశాలలో సుద్ద ముక్కలు కొనడానికి నిధులు లేకపోతే ఇక స్కూళ్లలో బోధన ఎలా జరుపుతారు. స్కూల్ గ్రాంటు లేకపోతే ఉపాధ్యాయులు ఏం చేయగలరు. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

– పి.నాగేశ్వరరావు, గొన్నవానిపాలెం, విద్యార్థి తండ్రి

బోధనకు ఆటంకం లేకుండా చర్యలు



పాఠశాల అభివృద్ధి గ్రాంటు విడుదల కాక నా సొంత నిధులతో సుద్దముక్కలు, స్టేషనరీ కొంటున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా బోధనకు ఆటంకం లేకుండా సుద్దముక్కలు, స్టేషనరీ, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నాం. నిధులు మంజూరు కోసం మండల అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– టి.వి.శేషగిరిరావు, వడ్డాది పాఠశాల హెచ్‌ఎం

గ్రాంటు రావాల్సి ఉంది



మండలంలో అన్ని పాఠశాలలకు గ్రాంటు రావాల్సి ఉంది. నిధులు మంజూరు అయిన వెంటనే ఆయా పాఠశాలల అకౌంటులో వేస్తాం. పాఠశాలల అభివృద్ధి గ్రాంటు మంజూరుపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. విద్యార్థులకు విద్యాబోధన అందేలా పటిష్టమైన చర్యలు చేపట్టాం. శానిటేషన్ సిబ్బంది జీతాలు రెండు, మూడు రోజుల్లో అందేలా చూస్తాం.

– బి.కాశీ విశ్వేరరావు, ఎంఈవో, బుచ్చెయ్యపేట

వేడుకగా అన్న సమారాధనలు


వి.సంతపాలెంలో అన్నసమారాధనలో ఉప సర్పంచ్ వెంకటరమణ


మాడుగుల : నవరవీధిలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు


ఎం.కోడూరులో అన్నసమారాధన


గొలుగొండ : అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కె.కోటపాడు: వి.సంతపాలెం శివారు శేరి కల్లాల వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వి.సంతపాలెం, వారాడ, ఆనందపురం గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నిదానాల్లో కెల్లా అన్నదానమే మిన్న అని గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగంపల్లి వెంకటరమణ అన్నారు. భక్తులకు ఆయన వడ్డనలను నిర్వహించారు.

మాడుగుల: స్థానిక నవర వీధిలో శనివారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భారీగా అన్న సమారాధన జరిపారు. మహరాజుల కోటలో ఏర్పాటు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు, కె.జె.పురం గ్రామాల్లో వినాయక మండపాల వద్ద శనివారం అన్నసమారాధన జరిపారు. కె.జె.పురంలో మహాత్మా టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో, ఎం.కోడూరులో దిగువ రామాలయం వద్ద యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధనలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదం స్వీకరించారు.

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లిలో వినాయక ఉత్సవాల్లో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పలు గ్రామాల నుండి భక్తజనం తరలి వచ్చి వినాయకుని మహా ప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు వినాయకుడిని దర్శించుకొని, అన్న సమారాధనను వడ్డన చేసి ప్రారంభించారు. నాగయ్యపేటలోని వినాయకుడి మండపం వద్ద ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను నిర్వహిస్తున్నట్లు స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో శనివారం వినాయక ఉత్సవాల సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 4వేల మంది భక్తులకు కమిటీ సభ్యులు అన్నసమారాధన జరిపారు. ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట, కొంకసింగి, నాగాపురం, పల్లావూరు తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

వరద బాధితులకు బ్రాహ్మణసేవా సంఘం విరాళం


విరాళం సొమ్మును ఎమ్మెల్యే రాజుకు అందజేస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు

చోడవరం: వరద బాధితుల సహాయార్థం చోడవరం శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ట్రస్టు తరఫున రూ. 42,502 ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ఈ మొత్తాన్ని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు సంఘ ప్రతినిధులు శనివారం అందజేశారు. ఇటీవల తుపానుకు విజయవాడ తదితర ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన ప్రజల సహాయార్థం తమ సేవా సంఘం ట్రస్టు తరపున విరాళంగా అందజేసినట్టు ట్రస్టు చైర్మన్ పుల్రేవు శ్యామ్ ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రతినిధులు వింజుమూరి శంకర్, కందర్ప సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం


పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ హైమావతి

రోలుగుంట: కంచుగుమల గ్రామంలో రావికమతం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషకాహార మాసోత్సవాలను టీచర్ వరలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో ర్యాలీ నిర్వహించారు. గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషక విలువలు గల ఆహారం గురించి చైతన్య పరిచారు. తరువాత అంగన్‌వాడీ కేంద్రంలో అధిక పోషకాలతో తక్కువ ధరకు లభించే ఆకుకూరలు, కూరగాయల గురించి సూపర్‌వైజర్ హైమవతి వివరించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారం, పీహెచ్‌సీలో ఉచితంగా ఇస్తున్న మందుల వినియోగం, ఆరోగ్య పరీక్షల గురించి తెలిపారు.

చెరువులో పడి రెండు పాడి గేదెలు మృతి


మృతిచెందిన గేదెలను పరిశీలిస్తున్న వీఆర్వో ముత్యాలు

కె.కోటపాడు: మండలంలో చౌడువాడ శివారు రాజమ్మ చెరువులో పడి రెండు పాడి గేదెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన గేదెల వెంకట రావు కు చెందిన రెండు గేదెలు మేతకు వెళ్లి నాలుగు రోజులుగా కనిపించలేదు. రైతు వెంకటరావు, కుటుంబ సభ్యులు గేదెల కోసం సమీప గ్రామాల్లో కూడా వెదికారు. తీరా రాజమ్మ చెరువులో రెండు పాడి గేదెలు మృతిచెంది ఉండడాన్ని శుక్రవారం రాత్రి స్థానిక రైతులు గుర్తించారు. ఇటీవల తుపాను సమయంలో కురిసిన వర్షాలకు రాజమ్మ చెరువులోనికి పెద్ద ఎత్తున వర్షపునీరు చేరుకుంది. రెండు గేదెల మెడకు, కాళ్లకు గుదికట్టు ఉండడం వల్ల నీటిలో మునిగి గేదెలు చనిపోయినట్టు రైతు వెంకటరావు తెలిపారు. రెండు గేదెల మృతితో రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు. రాజమ్మ చెరువులో మృతిచెందిన గేదెలను గ్రామ రెవెన్యూ అధికారి ముత్యాలు పరిశీలించారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు వెంకటరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పొడుగుపాలెంలో చిన్నారులకు టీకాలు


చిన్నారులకు టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న త్రినాథ్

కె.కోటపాడు: చిన్నారులకు వేసే వ్యాక్సినేషన్‌ల ద్వారా వయస్సుకు తగ్గ ఎదుగుదల, బరువు కలగనున్నట్టు లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. పొడుగుపాలెం గ్రామంలో శనివారం 0–5 ఏళ్ల చిన్నారులకు పెంటావాలెంట్, పోలియో, మీజిల్సు రుబెల్లా, పీసీవీ, ఐసీవీ వ్యాక్సిన్‌లను 15 మందికి వేశారు. గర్భిణులకు టీడీ వ్యాక్సిన్‌లను వేశారు. గర్భిణులకు వేసే వ్యాక్సిన్ వల్ల డిఫ్తీరియా, ధనుర్వాతం బారిన పడకుండా ఉంటారని త్రినాథ్ అన్నారు. చిన్నారులకు నిర్దేశించిన వయస్సులో తప్ప టీకాలను వేయించాలని సూచించారు.

హడలెత్తిస్తున్న పాముల సంచారం

మాకవరపాలెం : డ్రైనేజీలపై పేరుకుపోయిన తుప్పలను తొలగించాలని స్థానిక బీసీ కాలనీ ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీలపై భారీగా పెరిగి ఉన్న తుప్పల కారణంగా పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు. నిత్యం రాత్రి వేళల్లో ఈ పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి సైతం పాములు వస్తున్నాయని, చిన్నపిల్లలతో భయాందోళన చెందుతున్నామన్నారు. చాలా కాలంగా డ్రైనేజీలపై తుప్పలు ఉన్నా పట్టించుకునేవారు లేరన్నారు. శుక్రవారం రాత్రి పాము ఓ ఇంటిలోకి వస్తుండడం గమనించిన స్థానికులు దానిని హతమార్చారు. అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించి, తుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న


కోడాపల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు వెంకన్న, దొర

దేవరాపల్లి : కమ్యూనిస్టు ఉద్యమంలో సీతారాం ఏచూరి చెరగని ముద్ర వేసుకున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాప కార్యక్రమాన్ని దేవరాపల్లి, కోడాపల్లి, ఇప్పగరువు, పూలగరువు, రామన్నపాలెం, వాలాబులో శనివారం నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి పార్టీకి, దేశానికి తీరని లోటు అని అన్నారు. విద్యార్థి దశ ఉద్యమం నుంచి నాయకత్వ స్థాయికి అంచెలంచెలుగా జాతీయ స్థాయి నాయకుడిగా సీతారాం ఏచూరి ఎదిగారన్నారు. కార్యక్రమంలో సిహెచ్.లక్ష్మణ, ఈశ్వరరావు, లక్ష్మి, గంగులు, కె.సుధాకర్, దేముడు, గంగరాజు, రాంబాబు, కె.శ్రీను, చంద్రరావు, పేరయ్య, బీమాలమ్మ పాల్గొన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి

మాడుగుల : విద్యార్థి ఉద్యమాలు నుంచి జాతీయ స్థాయి నాయకుడుగా ఎదిగిన సీతారామ్ ఏచూరి ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని, సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి అన్నారు. శనివారం స్థానిక కనికరమాత కాలనీలో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజకీయాలుకు మార్గదర్శంగా సీతారాం ఏచూరి వ్యవహరించారని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె.భవాని, బొట్టా కన్నారావు, సుశీల, జలుమూరు కనక రత్నం పాల్గొన్నారు.

రోలుగుంట : ఏచూరి సీతారాం మృతి దేశానికి తీరని లోటు అని సీపీఎం మండల నాయకుడు ఈరెల్లి చిరంజీవి అన్నారు. కామ్రేడ్ ఏచూరి సీతారాం చిత్రపటానికి శనివారం మండల సీపీఎం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉండి, రైతుల.మహిళల హక్కుల కోసం సీతారాం ఏచూరి నిరంతరం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ భీమరాజు బాధ్యతల స్వీకారం

నాతవరం : స్థానిక ఎస్‌ఐగా సిహెచ్.భీమరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నర్సీపట్నం రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎం.రామారావు పరవాడ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన భీమరాజును స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. పలువురు నాయకులు ఎస్‌ఐను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం


రైతులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్, రిటైర్డు ఏడీ శ్రీరామమూర్తి

నాతవరం: తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్నిచ్చే వ్యవసాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని పతంజలి కంపెనీ మేనేజరు తోట చంద్రశేఖర్ అన్నారు. చిన జగ్గంపేటలో శనివారం ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు, సస్యరక్షణ చర్యలు, దిగుబడులు వంటి అంశాలపై రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ రిటైర్డు ఏడీ గాడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న మార్పులకు తగ్గట్టుగా రైతులు పంటలపై దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఆయిల్‌ఫామ్ తోటల పెంపకం లాభదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టరు పైల పోతురాజు, అసిస్టెంటు మేనేజరు రమేష్, ఫీల్డ్ అసిస్టెంటు నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.